ఈ-క్రాప్ వర్రీ!

పంటల నమోదులో తీవ్ర జాప్యం

- జిల్లాలో 3.77 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 1.20 లక్షల ఎకరాల్లో మాత్రమే ఈ-క్రాప్ పూర్తి
- నెలాఖరుతో పూర్తికానున్న గడువు
- సాంకేతిక సమస్యలు, వర్షాలే కారణమంటున్న అధికారులు
- రానున్నది తుపానుల కాలం కావడంతో అన్నదాతల్లో ఆందోళన

కంకిపాడు: ఈ-క్రాప్ నమోదు నత్తనడకన సాగుతోంది. గడువు ముగింపు సమయం దగ్గర పడుతున్నా, లక్ష్యాన్ని చేరుకోలేని పరిస్థితి. సాంకేతిక సమస్యలు, వర్షాలు పడుతున్న పరిస్థితుల్లో పంట పొలాల్లోకి వెళ్లటానికి ఆస్కారం లేకపోవటంతో ఈ-క్రాప్ నమోదు ఆశించిన స్థాయిలో జరగటం లేదు. దీనికి తోడు వ్యవసాయ, రెవెన్యూశాఖల మధ్య సమన్వయం కొరవడటం కూడా మరో కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 4,14,305 ఎకరాల్లో సాగు భూమి ఉంది. ఇందులో ఇప్పటి వరకూ వ్యవసాయశాఖ పంటలు 3,49,660 ఎకరాల్లో సాగు పూర్తి కాగా, ఉద్యాన పంటలు 27,888 ఎకరాల్లో సాగు పూర్తయ్యింది. ప్రధానంగా వరి, చెరకు, పసుపు, కంద, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి, బొప్పాయి, కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు.

ప్రయోజనాలు ఇవే..

ఈ-క్రాప్ నమోదు పూర్తికావటం వల్ల ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమ పథకాలు రైతులకు లబ్ధి చేకూరుతాయి. ప్రకృతి విపత్తుల సమయంలో బాధిత రైతాంగాన్ని తక్షణమే గుర్తించి పరిహారం అందించటంలో ఇబ్బందులు తొలగుతాయి. పంట ఉత్పత్తులు చేతికి అందిన తర్వాత మార్కెట్‌లో విక్రయించుకోవటానికి, మద్దతు ధర పొందటానికి ఆస్కారం ఉంటుంది.



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

లక్ష్యాన్ని చేరని నమోదు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తోంది. అయినా నేటికీ ఈ-క్రాప్ నమోదు పూర్తి కాలేదు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 3,77,549 ఎకరాల్లో పంటలు సాగు జరుగుతుండగా, 1.20 లక్షల ఎకరాల్లో మాత్రమే ఈ-క్రాప్ పూర్తయ్యింది. ఇంకా 65 శాతానికి పైగా భూములకు ఈ-క్రాప్ నమోదు కావాల్సి ఉంది. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ-క్రాప్ నమోదు గడువు పూర్తి కానుంది. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు. లక్ష్యాన్ని చేరుకోవటానికి నానా తంటాలు పడుతున్నారు.

శాఖల మధ్య సమన్వయం లోపం..

ఈ-క్రాప్ నమోదు రెవెన్యూ, వ్యవసాయశాఖలు సంయుక్తంగా పూర్తి చేయాల్సి ఉంది. రైతులతో కలిసి పంట పొలానికి వెళ్లి అక్కడ సాగులో ఉన్న పంట వివరాలు, సర్వే నంబర్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పూర్తిగా ధ్రువీకరణ చేసిన తరువాతే ఈ-క్రాప్ పూర్తి చేయాలి. కానీ ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. రెవెన్యూ శాఖ ఈ-క్రాప్ నమోదుకు పూర్తిగా దూరంగా ఉంటోంది. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది మాత్రమే క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. దీని వల్ల ఈ-క్రాప్ నమోదులో స్పష్టత ఎంత వరకూ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

భయపెడుతున్న కాలం..

రానున్నది వర్షాలు, తుపానుల కాలం. సెప్టెంబర్ అంటేనే హడలెత్తిపోయే రోజులు. ఈ పరిస్థితుల్లో పంటలకు నష్టం వాటిల్లితే రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులకు నష్టం వాటిల్లకుండా భరోసా కల్పించేందుకు ఈ-క్రాప్ లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అడుగడుగునా అవరోధాలు..

ఈ-క్రాప్ నమోదులో అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇటీవల భారీ వర్షాలు కురవటంతో పంట పొలాల్లోకి సిబ్బంది వెళ్లలేని పరిస్థితి. దీనికి తోడు కృష్ణానది ఏటి పాయలకు వరదనీరు చేరటంతో లంక భూముల్లోకి రాకపోకలు లేవు. దీంతో ఏటి పాయలోని లంక గ్రామాల్లోని వ్యవసాయ భూములకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు కూడా వెంటాడుతున్నాయి. సర్వర్ పనిచేయక ఈ-క్రాప్ నమోదులో జాప్యం ఏర్పడుతోందని సిబ్బంది వాపోతున్నారు. తాజాగా నెలకొన్న యూరియా కొరత, పంపిణీలో తలెత్తుతున్న సమస్యలతో ఎక్కువ భాగం సిబ్బంది యూరియా పంపిణీపై దృష్టి సారించటంతో ఈ-క్రాప్ ముందుకు సాగటం లేదు.

వేగవంతం చేస్తాం..

ఈ-క్రాప్ నమోదు వేగవంతానికి చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఈ-క్రాప్ నమోదును పూర్తి చేస్తున్నారు. ఇటీవల వర్షాలు వల్ల పంట పొలాల్లోకి వెళ్లలేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం యూరియా సమస్య పరిష్కారంపై దృష్టి సారించాం. సమస్య తీరగానే ఈ-క్రాప్‌పై దృష్టిసారించి లక్ష్యాన్ని చేరుతాం.

– ఎస్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి

యూరియా కోసం అన్నదాతల అవస్థలు



తేలప్రోలు(గన్నవరం): నియోజకవర్గంలో నెలకొన్న యూరియా కొరత అన్నదాతలను తీవ్రంగా వేధిస్తోంది. యూరియా కోసం రైతులు పీఏసీఎస్‌లు, ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. రోజంతా నిరీక్షించిన కట్ట యూరియా కూడా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు పీఏసీఎస్ వద్దకు సోమవారం యూరియా కోసం సుమారు 300 మందికిపైగా రైతులు వచ్చారు. అయితే ఉన్న స్టాక్‌ను ఒక్కొక్కరికి కట్ట చొప్పున పీఏసీఎస్ సిబ్బంది పంపిణీ చేశారు. అయితే కొంత మంది రైతులకు యూరియా పంపిణీ చేయగా, మిలిగిన రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఉంగుటూరు పీఏసీఎస్‌లో యూరియా పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సొసైటీకి శనివారం సాయంత్రం 225 బస్తాల యూరియా వచ్చిందని, ఒక్కొక్కరికి కట్ట చొప్పున పంపిణీ చేసేందుకు 225 మంది రైతుల పేర్లు సిబ్బంది ముందుగానే నోట్ చేసుకున్నారని చెబుతున్నారు. తీరా సోమవారం 110 మందికి మాత్రమే సరఫరా చేసి యూరియా స్టాక్ అయిపోయిందని చెబుతున్నారని రైతు వి.రవికుమార్ పేర్కొన్నారు. ఈ విషయమై పీఏసీఎస్ సిబ్బందిని అడిగిన సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని పలు గ్రామాల్లో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు.

క్లుప్తంగా

నేడు ఉయ్యూరులో 'అన్నదాత పోరుబాట'

కంకిపాడు: ఎరువుల బ్లాక్ మార్కెట్, ఎరువుల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు పట్టణంలో మంగళవారం అన్నదాత పోరుబాట నిర్వహించనుంది. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఆందోళనకు సిద్ధమైంది. రైతుల భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఉయ్యూరు పట్టణంలోని వీరమ్మతల్లి ఆలయం వద్ద నుంచి మార్కెట్‌యార్డు కార్యాలయం ప్రాంగణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకూ పాదయాత్ర చేపట్టనున్నారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందించనున్నారు.

పోరుబాటను విజయవంతం చేయండి

అన్నదాతల సమస్యలపై మంగళవారం ఉయ్యూరులో చేపట్టిన అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని రైతులు, పార్టీ శ్రేణులు ఆందోళనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి పామర్రు మాజీ శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని, ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు.

కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వీసం



గన్నవరం: ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గన్నవరానికి చెందిన వీసం శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడలోని పాయకాపురంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ఎన్నుకై నట్లుగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వీసం జవహర్‌లాల్ ప్రకటించారు. శ్రీనివాసరావు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి సంఘం బలోపేతానికి, రాష్ట్రంలోని కృష్ణ బలిజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబు, సంఘ నాయకులు మొవ్వ కోటేశ్వరకిరణ్, కేవీ నాగేశ్వరరావు, వీసం సత్యనారాయణ, నాగబాబు, అత్తులూరి దుర్గాప్రసాద్ అభినందించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు సమర్థవంతంగా నిర్వహించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని బాపులపాడు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ ఆదేశించారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీల నిర్వహణపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సోమవారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది కూడా పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణాన్ని ఎంపిక చేశామన్నారు. అండర్–14, 17 కేటగిరీల్లో బాలురు, బాలికల విభాగాలకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో చెప్పారు. ఉత్సాహవంతులైన క్రీడాకారులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇటీవల బదిలీ అయిన మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావును ఎంఈవో, వ్యాయామ ఉపాధ్యాయులు సన్మానించారు. బాలచంద్రుడు, రాజరాజేశ్వరి, మహబూబ్, నాగ సుబ్బారావు, నవీన్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

రామవరప్పాడు: ప్రసాదంపాడులో పారిశుద్ధ్యం మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో సోమవారం అంతర్గత రహదారులు, డ్రెయిన్లలో మురుగు పారుదలను పరిశీలించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. పారుదల లేని డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. చెత్తను రోడ్లపై పడేయకుండా చెత్త కుండీలను వినియోగించాలని సూచించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి మెరక తొలించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెదపులిపాకలో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో భార్యతో విభేదాల కారణంగా భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కోడూరు మండలం భావదేవరపల్లి గ్రామానికి చెందిన పెంజర్ల సురేష్‌కుమార్(35) పెదపులిపాక గ్రామం శ్రీనగర్‌కాలనీలో ఉంటూ ప్లాస్టిక్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతను గత కొద్ది సంవత్సరాల క్రితం వాణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. కాగా భార్యాభర్తలకు గత కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి సురేష్‌కుమార్ ఉరేసుకొని మృతి చెందాడని భావదేవరపల్లిలో ఉన్న మృతుడి తండ్రి కృపారావుకు కోడలు బంధువులు ఫోన్ చేసి చెప్పారు. సురేష్‌కుమార్ తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్వరాలతో బాధపడుతున్న రోగులను గుర్తించాలి

గన్నవరం: గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న రోగులను గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని జిల్లా మలేరియా విభాగం అధికారి బి.రామారావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆయన రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. తొలుత ఓపీ విభాగంలో రోగులతో మాట్లాడి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. రక్త పరీక్షలు, మందులు విభాగాలను ఆయన పరిశీలించారు. అనంతరం గన్నవరం, పెద్దఆవుటపల్లి, ఆత్కూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. సాధారణ జ్వరాలతో ఎక్కువ మంది ప్రజలు బాధపడుతున్నారని, వారిని గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేస్తున్నట్లు ఆయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది తెలిపారు.



రక్త పరీక్ష విభాగాన్ని తనిఖీ చేస్తున్న రామారావు

అనంతరం రామారావు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయం చేసుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించడంతో పాటు వాటర్ పైపులైన్ల లీకులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

గన్నవరంరూరల్: తెంపల్లిలో సోమవారం ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. డాక్టర్ జితేందర్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాల ఉన్న వారి వివరాలను సేకరించారు. ఇంటి ఆవాసాల మధ్య నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. ఇప్పటికే తెంపల్లి, బల్లిపర్రు గ్రామంలో ఫీవర్ సర్వే చేశామని తెలిపారు. జ్వరాలు ఉన్న కుటుంబాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామెళ్ల రాజేష్, వైద్య సిబ్బంది మంజుల, అనిత, దుర్గ, మేరీ, శకుంతల పాల్గొన్నారు.

రైతులకు యూరియా నిరంతర సరఫరా

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: రైతులకు యూరియా నిరంతర సరఫరా చేస్తామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. తాడిగడప రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు యూరియా నిరంతర సరఫరా జరుగుతుందన్నారు. జిల్లాకు ఇంకా 1300 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఖరీఫ్ రైతులకు తొలుత యూరియా అందజేస్తామని, వాణిజ్య పంటలకు ఆ తరువాత యూరియా అందిస్తామని హామీ ఇచ్చారు. తాడిగడపలో రైతులకు 10 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చామన్నారు. యూరియా పంపిణీకి సంబంధించి వివరాలను అధికారులు నమోదు చేయాలని ఆదేశించారు.

కావాల్సినంత యూరియా ఇవ్వండి

తమకు అవసరాలకు కావాల్సినంత యూరియా ఇవ్వాలని రైతులు జిల్లా కలెక్టర్ బాలాజీని కోరారు. కలెక్టర్ రైతులతో మాట్లాడిన సమయంలో రైతులు యూరియా సరఫరా పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న యూరియా చాలటం లేదని, ప్రధానంగా వాణిజ్య పంటలకు యూరియా అందటం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ గోపాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, అధికారులు పాల్గొన్నారు.



తాడిగడపలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

బీబీ గూడెం పీఏసీఎస్ పరిశీలన

గన్నవరంరూరల్: రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేస్తామని, ఆందోళన చెందవద్దని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని బీబీగూడెం పీఏసీఎస్‌ను సోమవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేసి యూరియా పంపిణీని పరిశీలించారు. రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడుతూ ఎకరానికి ఎంత యూరియా అవసరం అవుతుంది, ఎంత వినియోగిస్తున్నారో తెలుసుకున్నారు. ఎకరానికి మూడు బస్తాలు యూరియా అవసరమని, ఇప్పటికి ఒక లోడు వచ్చిందని పీఏసీఎస్ అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ కలెక్టర్‌కు తెలిపారు. ఇంకా యూరియా అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేస్తామని, ఖంగారు పడవద్దని చెప్పారు. తహసీల్దార్ వెంకట శివయ్య, సొసైటీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

సంప్రోక్షణల అనంతరం తెరుచుకున్న ఆలయాలు

గన్నవరం: చంద్రగ్రహణం అనంతరం మండలంలోని ఆలయాలు సోమవారం తెరుచుకున్నాయి. చంద్రగ్రహణం సందర్భంగా శైవ, వైష్ణవ ఆలయాలను ఆదివారం మూసివేశారు. గ్రహణం తెల్లవారుజామున ముగియడంతో ఉదయం సంప్రోక్షణలు తర్వాత ఆలయాలను తెరిచారు. స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో సంప్రోక్షణ తర్వాత అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర ఆలయంలో సంప్రోక్షణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో చంద్రగ్రహణం తరువాత ఆలయంలో సంప్రోక్షణ చేశారు. ఆలయ ద్వారాలు ఆదివారం మూసివేయగా సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ ద్వారాలను అర్చకులు తెరిచారు. ఆలయ సంప్రోక్షణ చేసి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచహారతులు, పల్లకీసేవ అత్యంత వైభవంగా జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



యనమలకుదురు ఆలయంలో భక్తుల సందడి

ఘనంగా మరియమాత జన్మదిన వేడుకలు



గన్నవరంరూరల్: మండలంలోని చిక్కవరంలో సోమవారం తిరుకుటుంబ దేవాలయంలో మరియమాత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. విచారణ కర్తలు ఫాదర్ తోకల సురేష్ ఆధ్వర్యంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. మరియమాత పడిన వేదనలు, కష్టాలను ఫాదర్ సురేష్ వివరించారు. ముఖ్య అతిథిగా చిల్లకల్లు ఫాదర్ కూరపాటి బాలయేసు పాల్గొన్నారు. అనంతరం చిక్కవరం గ్రామంలో వైభవంగా తేరు ప్రదక్షిణ నిర్వహించారు. సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు, డాన్ బాస్కో యూత్ పాల్గొన్నారు.

సమీప గ్రామాల్లో పొలం ఉన్నా ఎరువులు ఇవ్వండి


నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ రైతులకు సమీప గ్రామాల్లో పొలం ఉన్నా ఎరువులను ఇవ్వాలని సబ్‌కలెక్టర్ కావూరి చైతన్య సొసైటీ అధికారులను ఆదేశించారు. నున్న గ్రామంలో కోపరేటివ్ సొసైటీ గోదాములోని ఎరువులను సబ్‌కలెక్టర్ సోమవారం పరిశీలించారు. యూరియా స్టాక్ ఎంత ఉందనే వివరాలను సొసైటీ సిబ్బందిని ఆయన అడగ్గా 28 మెట్రిక్ టన్నులుందని చెప్పారు. ఈ సందర్భంగా నున్న గ్రామ రైతులు తమకు పక్క గ్రామాలైన ముస్తాబాదు, వెదురుపావులూరు, సూరంపల్లి, రామచంద్రపాలెం గ్రామాల్లో పొలాలున్నాయని వాటికి యూరియా అడుగుతుంటే ఇవ్వడం లేదని సబ్‌కలెక్టర్‌కు చెప్పారు. సమీప గ్రామాల్లో పొలం సాగు చేస్తున్న రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. ఎకరాకు అరబస్తా మాత్రమే విక్రయిస్తున్నారని రైతులు చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.రఘురామ్, సొసైటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నున్నలో రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కావూరి చైతన్య

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాలలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది, ఉత్తమ సమాజ నిర్మించే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న బండ్లపల్లి నాగరాజుకు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కటంతో ఆ గ్రామస్తులు సోమవారం పౌర సత్కారం నిర్వహించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో నాగరాజును ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్, గ్రామ ప్రముఖులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావుతో పాటుగా పలువురు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. విద్యార్థులను నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష, నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లకు తర్ఫీదు ఇచ్చి ఎంపిక కావటంలో ఆయన చొరవ అభినందనీయమని కొనియాడారు. ఎంపీటీసీ సభ్యుడు పి.లక్ష్మీనారాయణ, పాఠశాల హెచ్ఎం జాస్మిన్, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, విజయ, శివ నాగరాజు పాల్గొన్నారు.



రంగన్నగూడెంలో నాగరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

హెచ్ఎం కుమార్‌బాబు సేవలు ప్రశంసనీయం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో మెయిన్ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కె.కుమార్‌బాబుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. వృత్తి పట్ల అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు వస్తుందన్నారు. కుమార్‌బాబు సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు నాగేంద్ర, పంకజ, మరియ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి రోటరీ క్లబ్ ఆర్థిక సహాయం



గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి పుణ్య చారిటీస్ వృద్ధాశ్రమంలో సోమవారం గన్నవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పుణ్య చారిటీస్ కార్యదర్శి రొటేరియన్ జాస్తి విజయభూషణ్‌కుమార్ పదో తరగతి చదువుతున్న విద్యార్థి తల్లి చెరుకూరి నాగలక్ష్మికి చెక్కును అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీవీ రవిబాబు, సభ్యులు నర్రా సీతారామారావు, గన్నె వెంకట్రావు, తులసీమోహన్, సురేష్‌బాబు ఉన్నారు.


అనధికార లేఅవుట్లు, ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకోండి

తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ నజీర్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అనధికార లేఅవుట్లు, ప్లాట్‌లు క్రమబద్ధీకరించుకోవటానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపాలిటీ కమిషనర్ షేక్.నజీర్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరణకు జీవో ఎంఎస్ నంబర్ 134 జారీ చేసిందన్నారు. ఈ ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకం కింద 30-6-2025 ముందు వేసిన అనధికార లేఅవుట్లు, ప్లాట్‌లకు నిర్ణీత అపరాధ రుసుం చెల్లించాలని అలాగే 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లైసెన్స్ ఇంజినీర్/సర్వేయర్‌తో ప్లాన్ తయారు చేయించి రూ.10 వేలు లేదా 50 శాతం అపరాధ రుసుం చెల్లించి యాజమాన్య హక్కు పత్రం, ప్లాన్‌లతో 24-10-2025 నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాలకు మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కమిషనర్ నజీర్ సూచించారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్‌లు క్రమబద్ధీకరించుకోకుంటే క్రయ విక్రయాలు జరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధ జాబితాలో చేర్చుతామని ఆయన హెచ్చరించారు.

వీఆర్‌కు ఐదు అవార్డులు ప్రదానం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి జేఎన్‌టీయూ కాకినాడ ఐదు ప్రతిష్టాత్మకమైన అవార్డులను ప్రదానం చేసింది. ఈ మేరకు సోమవారం యాజమాన్యం వివరాలు తెలుపుతూ ఈ నెల 6న జేఎన్‌టీయూ ఫార్మేషన్ డే సందర్భంగా అవార్డులు అందజేశారన్నారు. ఫ్యాకల్టీ రీసెర్చ్ ఇంపాక్ట్ అవార్డు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్‌కు ప్రదానం చేశారన్నారు. అలాగే స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ గ్లోబల్ సైంటిస్ట్ రికగ్నిజేషన్ అవార్డు కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.రూపాకు ఇచ్చారు. అకడమిక్ స్ట్రెంగ్త్ అండ్ డాక్టరేట్స్ అవార్డు ఇచ్చారు. వీఆర్‌లో 204 మంది అధ్యాపకులు పీహెచ్‌డీ పొందినందున ఈ అవార్డు వచ్చింది. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అవార్డు అందజేశారు. కాలేజీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఒక్కొక్కటి రూ.20 లక్షలకు పైగా విలువ కలిగిన 8 ఆర్అండ్‌డీ ప్రాజెక్టులు ఉన్నందున అవార్డు ప్రదానం చేశారు. స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డును విద్యార్థిని వేములపల్లి నిహితకు అందించారు. ఆమె అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో రూ.52.6 లక్షల వార్షిక ప్యాకేజీలో ప్లేస్‌మెంట్ సంపాదించినందుకు అవార్డు పొందారు. వారికి సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉప కులపతి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15వ తేదిన కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల మాజీ కార్యదర్శి అబ్దుల్ బారీ పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ హనుమాన్‌జంక్షన్ పట్టణ, బాపులపాడు మండల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక నూజివీడురోడ్డులో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం హామీ ఇచ్చిన పథకాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 లక్షలపైగా బిల్డింగ్ వర్కర్స్ ఉన్నారని, వీరికి సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ రంగ కార్మికులకు అమలు చేస్తున్న ప్రమాద బీమా, స్వయం ఉపాధి పథకాలు, పిల్లలకు స్కాలర్‌షిప్ వంటి సంక్షేమ పథకాలను రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్, పట్టణ అధ్యక్షుడు వడ్డి గిరిధర్, ఉపాధ్యక్షుడు పోలిమెట్ల ఏసేబు, కోశాధికారి స్వర్ణ కిరణ్, కార్యవర్గ సభ్యుడు రాజులపాటి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.